# కేంద్రంనుంచి వరద నిధులు ఇప్పించండి

● సుప్రీంకోర్టును ఆశ్రయించిన ప్రభుత్వం



చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మిచౌంగ్ తుఫాను సహా వరద బాధితులను ఆదుకునేందుకు కేంద్రప్రభుత్వం నుంచి రూ.2వేల కోట్ల మేరకు సహాయక నిధులు విడుదల చేసేలా ఉత్తర్వులివ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. గత యేడాది చివరన చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్పట్టు జిల్లాలు మిచౌంగ్ తుఫాను కారణంగా తీవ్రంగా నష్టపోయాయి. ఇదే విధంగా డిసెంబర్ ఆఖరున తూత్తుకుడి, తిరునెల్వేలి, తెన్‌కాశి, కన్నియాకుమారి జిల్లాల్లో కుండపోతగా కురిసిన భారీ వర్షాలకు వరదలు సంభవించాయి. చెన్నై సహా ఎనిమిది జిల్లాల్లో వరద బాధితులను ఆదుకునేందుకు, ఆయా ప్రాంతాల్లో పునరావాస చర్యలు చేపట్టేందుకు రూ.30 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని ప్రధాని మోదీని కోరుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ రాశారు. ఢిల్లీ వెళ్లి మోదీతో భేటీ అయ్యి వరద నష్టాల వివరాలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఆ తర్వాత పలుమార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసినా నిధులు మంజూరు కాలేదు. ఈ విషయాన్ని వేలూరులో మంగళవారం సాయంత్రం జరిగిన ఎన్నికల ప్రచార సభలో స్టాలిన్ గుర్తు చేస్తూ వరద నిధులు ఇవ్వని కేంద్రప్రభుత్వ మొండి వైఖరిని ఖండించేలా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఉదయం రాష్ట్రప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు విల్సన్, కుమరన్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం ఎనిమిది జిల్లాల్లో గత డిసెంబర్ తుఫాను, వరదలకు రూ.38,907 కోట్ల మేరకు నష్టం వాటిల్లిందని, కేంద్ర నుంచి విడుదలవుతుందనే నమ్మకంతో రాష్ట్రప్రభుత్వం వరద నిధులు కేటాయించి బాధితులను ఆర్థికంగా ఆదుకున్నదని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. నాలుగు నెలలవుతున్నా కేంద్రం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాలేదని, ఈ పరిస్థితుల్లో బాధితులను ఆదుకునేందుకు తక్షణ సాయంగా రూ.2 వేల కోట్లు విడుదల చేసేలా కేంద్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ సుప్రీ కోర్టు ధర్మాసనం ఎదుట త్వరలో విచారణకు రానున్నదని రాష్ట్ర ప్రభుత్వ తరపు న్యాయవాది విల్సన్ పేర్కొన్నారు.



# చెన్నైలో దాహం.. దాహం

● పెరిగిన నీటి వినియోగం

ప్యారీస్, ఏప్రిల్ 3: రాజధాని నగరం చెన్నైలో 200 వార్డుల్లో తాగునీటి అవసరాలు పెరగడంతో 3,600 ట్యాంకర్ల ద్వారా సరఫరా చేపట్టినట్లు మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు. చెన్నైకి తాగునీరందించే రిజర్వాయర్లలో ప్రస్తుతం ఎండ తీవ్రత కారణంగా రోజురోజుకు నీటి నిల్వలు ఆవిరై పోతున్నాయి. తిరువళ్లూర్ జిల్లాలో ఉన్న పూండి, చోళవరం, పుళల్, కండన్‌కోట తేర్వాయ్ కండిగ, చెంబరంబాక్కం రిజర్వాయర్లు 11.75 టీఎంసీల సామర్థ్యం కలిగి ఉన్నాయి. అయితే, ప్రస్తుతం ఈ రిజర్వాయర్లలో 8 టీఎంసీల కంటే తక్కువగా నీటి నిల్వలున్నాయి. 2023 ఏప్రిల్‌లో ఈ రిజర్వాయర్లలో 9.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ నేపథ్యంలో, ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంటుందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించింది. అగ్నినక్షత్రం అరంగేట్రానికి ముందే సూర్య భగవానుడి ప్రతాపం పెరగడంతో తాగునీటి అవసరం చాలా వరకు పెరిగింది. సాధారణంగా వేసవిలో రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చెన్నై మెట్రోవాటర్ బోర్డు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి ట్యాంకర్ లారీల ద్వారా సరఫరా చేస్తుంటారు. గ్రేటర్‌కు ప్రతిరోజు 1,000 మిలియన్ లీటర్ల తాగునీరు అవసరమని గుర్తించిన అధికారులు, 2021వ సంవత్సరం నుంచి ఈ స్థాయిలోనే నీరు సరఫరా చేస్తున్నారు. ఈ సంవత్సరం ఈనెల 3వ తేది మంగళవారం వరకు 1,073 మిలియన్ లీటర్ల నీటి అవసరం ఏర్పడింది. దీంతో నివాస ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే ట్యాంకర్ లారీల ట్రిప్పు సంఖ్య కూడా అదనంగా పెరిగింది. డయల్ వాటర్ అనే పథకంలో నగదు చెల్లించి తాగునీరు పొందే గృహ యజమానుల సంఖ్య కూడా పెరిగింది. నివాస ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సింథటిక్ ట్యాంక్‌లలో నీటిని నింపేందుకు 3,600 నుంచి 3,800 లారీల ద్వారా రోజుకు 30 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా, మరో 8 నెలల వరకు తాగునీటి కొరత తీర్చే విధంగా నగరానికి నీరు అందించే రిజర్వాయర్లలో నీటి నిల్వలున్నాయని, నెలకు టీఎంసీ చొప్పున వచ్చే అక్టోబరు వరకు ఈ నీటిని ప్రజలకు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వేసవి ప్రారంభమైనా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఒకవేళ రిజర్వాయర్లు అడుగంటితే నిర్లవణీకరణ ప్లాంట్లు ఆదుకుంటాయని అధికారులు భరోసా కల్పిస్తున్నారు.

## 12న రాష్ట్రానికి రాహుల్ రాక

● కాంగ్రెస్ అభ్యర్థులకు అజారుద్దీన్ ప్రచారం

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ నెల 12న ఒక్క రోజు పర్యటన నిమిత్తం రాష్ట్రానికి విచ్చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న తొమ్మిదిమంది అభ్యర్థులతో పాటు 'ఇండియా' కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం



రాహుల్‌గాంధీ - అజారుద్దీన్

చేయనున్నారు. కోయంబత్తూరు, తిరునెల్వేలి నియోజకవర్గాల్లో ఆయన విస్తృతంగా పర్యటించే అవకాశం ఉందని టీఎన్‌సీసీ నేతలు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా త్వరలో రాష్ట్రానికి విచ్చేస్తారని తెలిపారు.

**కాంగ్రెస్‌కు మద్దతుగా అజారుద్దీన్ ప్రచారం**

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, మాజీ ఎంపీ అజారుద్దీన్ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మద్దతుగా ప్రచారం చేయనున్నారు. దేశంలో తొలివిడత పార్లమెంట్ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ప్రచారం చేయడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, క్రికెటర్ అజారుద్దీన్ సహా పలువురు ప్రముఖులను ప్రధాన ప్రచారకర్తలుగా ఏఐసీసీ ఎంపిక చేసింది. ఆ మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా అజారుద్దీన్ ప్రచారం చేయనున్నారు. త్వరలో ఆయన ప్రచార తేదీలను ఏఐసీసీ ప్రకటించనుందని టీఎన్‌సీసీ వర్గాలు పేర్కొన్నాయి.

## పదేళ్లుగా దేశాన్ని భ్రష్టుపట్టించిన బీజేపీ

● తిరువణ్ణామలై సభలో సీఎం స్టాలిన్ ధ్వజం





బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా దేశాన్ని భ్రష్టుపట్టించిన బీజేపీ మతతత్వ, నిరంకుశపాలనకు చరమగీతం పాడాలని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ పిలుపునిచ్చారు. తిరువణ్ణామలైలో బుధవారం సాయంత్రం డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ... దేశాన్ని కాపాడే ప్రధాని కావాలంటే ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. సామాజిక న్యాయం కొనసాగాలన్నా, మతసామరస్యం వెల్లివిరియాలన్నా, రాజ్యాంగాన్ని కాపాడాలన్నా బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రధాని నరేంద్రమోదీకి ఓటమి భయం పట్టుకుందని, ప్రతి రోజూ అసత్యాలతో ప్రజలను భయపెట్టి, మోసగించి ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇప్పటివరకూ ప్రధాని మోదీకి సహకరించిన ఐటీ, ఈడీ, సీబీఐతో పాటు కొత్తగా ఆర్బీఐ కూడా చేరిందన్నారు. ఇక తానేమి చెప్పినా జనం నమ్మరని భావించిన మోదీ ఆర్బీఐతో అబద్ధాలను వెదజల్లుతున్నారని ఎద్దేవా చేశారు. ఎక్కడో ఉత్తరాదిలో ఎన్నికల ప్రచార సభలో కచ్చాదీవు గురించి ప్రస్తావించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. జూన్ 4 తర్వాత మోదీ ప్రభుత్వం గద్దె దిగటం ఖాయమని ఆ తర్వాత ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. జూన్ 3న మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతవార్షికోత్సవాలు ముగుస్తాయని, ఆ సందర్భంగా ఇండియా కూటమి విజయాన్ని ఆయనకు కానుకగా సమర్పించాలని స్టాలిన్ కోరారు. ప్రధాని మోదీ ఇటీవల ఓ తమిళ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాష్ట్రానికి సంబంధించి కేంద్రప్రభుత్వం ఎలాంటి ప్రత్యేక పథకాలు అమలు చేసిందన్న వివరాలు చెప్పలేదని, తమిళ భాష, తమిళ ప్రజలంటే తనకెంతో ఇష్టమని కబుర్లతోనే ఆ ఇంటర్వ్యూ సాగిందన్నారు. పదేళ్లలో రాష్ట్రానికి అమలు చేసిన ప్రత్యేక పథకాలు గురించి చెప్పండంటూ మోదీని కలిసిన ప్రతిసారీ అడుగుతున్నా బదులివ్వడం లేదన్నారు. ఈడీ, ఐటీ విపక్షాలను టార్గెట్‌గా చేసుకుని జరిపిన దాడులు గురించి తనకు తెలియవని మోదీ చెప్పడం గర్హనీయమన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టు గురించి తెలియదా? కాంగ్రెస్ ఖాతాలు స్తంభింపజేయడం తెలియదా? అని స్టాలిన్ ప్రశ్నించారు. గత యేడాది డిసెంబర్‌లో ఎనిమిది జిల్లాల్లో వరదలు సంభవిస్తే బాధితులను పరామర్శించేందుకు మోదీ రాకపోగా ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదన్నారు. నిర్మలా సీతారామన్ వరద బాధిత ప్రాంతాల్లో పరిశీలించినప్పుడు కేంద్రం నుండి నిధులు వస్తాయని ఆశించానని, చివరకు ఆమె కూడా మొండి చెయ్యి చూపించారన్నారు.

**విత్త మంత్రి నోటా అబద్ధమే...**

రెండు రోజులకు ముందు చెన్నైలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్... రాష్ట్రానికి రూ.5వేల కోట్లు ఇచ్చామని, ఆ నిధులకు సంబంధించిన లెక్కలు చెప్పాలంటూ కందువడ్డీ వ్యాపారిలా తన అహంకారాన్ని ఎలుగెత్తి చాటారని స్టాలిన్ విమర్శించారు. వాస్తవానికి ఆ రూ.5వేల కోట్లు కేంద్రం ఇచ్చిన నిధులు కావని రాష్ట్ర ప్రభుత్వానికి విదేశీ బ్యాంకులు ఇచ్చిన రుణాలన్నారు. ఇలా విదేశీ బ్యాంకుల నుంచి రాష్ట్రం పొందిన రుణాలను ఎలా ఖర్చుపెట్టారని సూటిగా అడుగుతున్న మంత్రి నిర్మలా సీతారామన్‌కు రుణాలు, కేంద్ర నిధులకు తేడా కూడా తెలియకపోవడం గర్హనీయమన్నారు. కేంద్రం నుండి నిధులు రాకపోయినా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా రూ.2,478కోట్ల మేరకు నిధులు విడుదల చేసి తుఫాను, వరద బాధితులను ఆదుకుందని చెప్పారు.

## గిండి ఫ్లైఓవర్‌పై 'మెట్రో' పరుగులు



కత్తిపారా వద్ద ఫ్లైఓవర్ కోసం నిర్మిస్తున్న ఎత్తయిన స్తంభం

ప్యారీస్, ఏప్రిల్ 3: చెన్నై మెట్రోరైలు పథకంలో ఇప్పటివరకు లేని విధంగా గిండి జంక్షన్ సమీపంలో 30 మీటర్ల ఎత్తున ఫ్లైఓవర్‌పై మెట్రో రైలు పరుగులు తీయనుంది. సవాళ్లతో కూడిన ఈ పథకం పనులను లార్సన్ అండ్ టూబ్రో సంస్థకు అప్పగించినట్లు సీఎంఆర్‌ఎల్ అధికారులు తెలిపారు. నగరంలో జనాభాతో పాటు వాహనాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. దీంతో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కరించేలా మెట్రోరైలు పథకం తొలివిడత కింద ప్రస్తుతం నగరంలో నడుపుతున్న మెట్రో రైళ్లకు ప్రజాదరణ పెరిగింది. దీంతో, రెండో విడత మెట్రో రైలు పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మాధవరం నుంచి షోళింగనల్లూర్ వరకు వెళ్లే 5వ మార్గంలో గిండి కత్తిపార జంక్షన్‌లో అందర్నీ ఆశ్చర్యపరిచే విధంగా 30 మీటర్ల ఎత్తు కలిగిన ఫ్లై ఓవర్‌పై మెట్రో రైళ్లు నడపనున్నారు. ప్రస్తుతం 1, 2వ విడత మార్గాల్లో నడుపుతున్న రైళ్లను ఈ మార్గంలో కలుపుతూ రైలు మార్గం ఏర్పాటవుతోంది. దీనిపై ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జునన్ మాట్లాడుతూ... విం‌కోనగర్ - విమానాశ్రయం, సెంట్రల్ - సెయింట్ థామస్ మౌంట్ మార్గంలో బ్యాలెన్స్ కన్లీవర్ విధానంలో పనులు నిర్వహించేందుకు ఎల్ అండ్ టీ సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించినట్లు తెలిపారు. భట్ రోడ్డు, ఆలందూర్ మధ్య 125 మీటర్ల వ్యాసంతో ట్రాక్ నిర్మించడానికి అవసరమైన పరికరాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోనున్నట్లు ఎల్ అండ్ టీ మేనేజర్ కృష్ణప్రభాకర్ తెలిపారు.

## మార్చిలో తెగ తాగేశారు!

● రికార్డు స్థాయిలో రూ.4,475 కోట్ల అమ్మకాలు

● ప్రతి రోజూ 12 లక్షల బీర్లు విక్రయం

అడయార్, ఏప్రిల్ 3: మార్చిలో రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. ఈ నెలలో ఏకంగా రూ.4,475 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది. మందుబాబులు ప్రతి రోజూ 12 లక్షల బాటిళ్ల బీర్‌ను సేవించారు. ఈ విక్రయాలు ఏప్రిల్‌లో మరింత పెరిగే అవకాశం ఉందని టాస్మాక్ అధికారులు అంచనా వేస్తున్నారు. గత నెల మూడో వారంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత అభ్యర్థుల నామినేషన్ దాఖలు, ప్రచారం వంటి కార్యక్రమాల్లో ద్వితీయ శ్రేణి నేతలతో పాటు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొంటున్నారు. వీరికి రోజువారీ ఖర్చుల కింద కొంత నగదునే చేతికి ఇస్తూనే బిర్యానీ ప్యాకెట్, మద్యాన్ని అభ్యర్థులు అందిస్తున్నారు. దీంతో మద్యం విక్రయాలు మార్చి నెల మూడో వారం నుంచి క్రమంగా ఊపందుకున్నాయి. నెలాఖరుకు ఈ ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో మార్చిలో రూ.4,475 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. మొత్తం 87 లక్షల బాక్సుల మద్యం అమ్ముడు పోయింది. మార్చిలో బీర్ బాటిళ్ళు మాత్రమే 32.72 లక్షల కేస్‌లు విక్రమయ్యాయి. అంటే ప్రతి రోజూ సగటున 12 లక్షల బాటిళ్ళ బీర్లు విక్రమయ్యాయి. ఈ విక్రయాలు ఫిబ్రవరిలో 26.93 లక్షలుగా (రోజుకు 24.40 లక్షల బీర్లు) ఉన్నాయి. మార్చిలో మొత్తం 55.07 లక్షల కేస్‌ల మద్యం విక్రయమైంది. ఫిబ్రవరిలో ఇది 47.34 లక్షలుగా ఉంది. జనవరిలో 57 లక్షలుగా ఉందని టాస్మాక్ అధికారులు తెలిపారు. మొత్తం 12 బాటిళ్ళు ఉన్న ఒక బాక్సు ధర సగటున రూ.1900, 48 క్వార్టర్ మద్యం బాటిళ్లు కలిగిన ఒక బాక్సు రూ.7 వేలుగా ఉంది. ఈ గణాంకాల చొప్పున రూ.621 కోట్లకు బీరు, రూ.3,854 కోట్లకు వివిధ రకాల మద్యం అమ్ముడుపోయింది. ఫిబ్రవరిలో రూ.511 కోట్లకు బీరు, ఇతర మద్యం రకాల విక్రయాలు రూ.3,313గా ఉంది. ఈ విక్రయాలు ఏప్రిల్‌లో మరింతగా పెరిగే అవకాశం ఉందని టాస్మాక్ అధికారులు తెలిపారు.

**రంజాన్ వేళలు**

గురువారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.28

శుక్రవారం : సహర్ : ఉదయం - 4.21



## 3 రోడ్‌షోలు... 3 బహిరంగ సభలు

నాలుగు రోజులపాటు మోదీ ప్రచారం



చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ నాలుగు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ నెల 9, 10, 13, 14 తేదీల్లో ప్రచారం చేయనున్నారు. మూడు ప్రాంతాల్లో రోడ్‌షోలు, మరో మూడో చోట్ల జరిగే బహిరంగ సభల్లో ప్రసంగిస్తారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ జారీ కాకముందే మోదీ రాష్ట్రంలో ఐదుసార్లు పర్యటించారు. కోయంబత్తూరు, సేలం, మదురై, తిరునెల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి తదితర జిల్లాల్లో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. కోయంబత్తూరులో రోడ్‌షో నిర్వహించారు. చెన్నై నందనంలో ఏర్పాటైన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ నాలుగు రోజులపాటు రోడ్ షోలు, ప్రచార సభల్లో పాల్గొననున్నారు. ఈనెల 9 సాయంత్రం 4గంటలకు వేలూరులో ఎన్డీయే అభ్యర్థి, న్యూ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగానికి మద్దతుగా రోడ్‌షోలో పాల్గొంటారు. ధర్మపురి పీఎంకే అభ్యర్థి సౌమ్యా అన్బుమణి, కృష్ణగిరి బీజేపీ అభ్యర్థి నరసింహన్, కళ్ళకుర్చి పీఎంకే అభ్యర్థి దేవదాస్, తిరువణ్ణామలై బీజేపీ అభ్యర్థి అశ్వత్థామన్, ఆరణి పీఎంకే అభ్యర్థి గణేష్‌కుమార్, చిదంబరం బీజేపీ అభ్యర్థి కాత్యాయని, కడలూరు పీఎంకే అభ్యర్థి తంగర్‌బచ్చాన్‌కు మద్దతుగా ప్రచారం చేస్తారు. ఆ రోజు సాయంత్రం 6గంటలకు టి.నగర్‌లో సౌత్ చెన్నై బీజేపీ అభ్యర్థి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహిస్తారు. సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం, నార్త్ చెన్నై బీజేపీ అభ్యర్థి పాల్ కనకరాజ్, తిరువళ్లూరు బీజేపీ అభ్యర్థి పొన్ బాలగణపతి, శ్రీపెరుంబుదూరు టీఎంసీ అభ్యర్థి వేణుగోపాల్, కాంచీపురం పీఎంకే అభ్యర్థి జ్యోతి వెంకటేశన్, అరక్కోణం పీఎంకే అభ్యర్థి కే.బాలుకు మద్దతుగా ప్రచారం చేస్తారు. ఆ తర్వాత ఈనెల 10 ఉదయం 11 గంటలకు నీలగిరి నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్‌కు మద్దతుగా రోడ్‌షో ద్వారా ప్రచారం చేస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం కోయంబత్తూరులో ఏర్పాటయ్యే బహిరంగ సభలో పాల్గొంటారు. ఆ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పొల్లాచ్చి, తిరుప్పూరు, ఈరోడ్, సేలం, నామక్కల్ నియోజకవర్గాల ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తారు. 13న ఉదయం 11 గంటలకు పెరంబలూరులో ఏర్పాటయ్యే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఆ సభలో ఐజేకే అభ్యర్థి పారివేందర్, తిరుచ్చి, తంజావూరు, నాగపట్టినం, మైలాడుదురై, విల్లుపురం అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తారు. 14న విరుదునగర్ నియోజకవర్గంలో ఏర్పాటయ్యే బహిరంగ సభలో ప్రసంగిచనున్నారు. బీజేపీ అభ్యర్థి రాధికా శరత్‌కుమార్, మదురై, తేని, దిండుగల్, రామనాథపురం, శివగంగ, కన్నియాకుమారి, తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న ఎన్డీయే అభ్యర్థులు పాల్గొంటారు.

**అమిత్ షా పర్యటన రద్దు**

పెరంబూర్: రాష్ట్రంలో పోటీ చేస్తున్న బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతుగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన రద్దయింది. గురువారం రాష్ట్రానికి రానున్న అమిత్‌షా, తేనిలో పోటీ చేస్తున్న ఏఎంఎంకే అభ్యర్థి టీటీవీ దినకరన్‌కు మద్దతుగా వాహన ర్యాలీలో పాల్గొనడంతో పాటు రామనాథపురం, శివగంగ, మదురైలో రెండు రోజుల పాటు ప్రచారం చేపడతారని ప్రకటించిన రాష్ట్ర బీజేపీ నేతలు అందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో, షా రాష్ట్ర పర్యటన రద్దయినట్టు ప్రకటించారు. మళ్లీ ఎప్పుడు ప్రచారానికి వస్తారనే విషయం త్వరలో వెల్లడిస్తామని బీజేపీ శ్రేణులు పేర్కొన్నాయి.

## సమాచార దర్శిని

### పెరిగిన విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, ఏప్రిల్ 3: థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి 2,500 కోట్ల యూనిట్లకు పెరిగినట్లు విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు. తూత్తుకుడి, సేలం, తిరువళ్లూర్ జిల్లాల్లో విద్యుత్ బోర్డుకు 4,320 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు థర్మల్ విద్యుత్ కేంద్రాలున్నాయి. వీటిలో ప్రతిరోజు 7 నుంచి 8 కోట్ల యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. 2020-21లో 1,555 కోట్ల యూనిట్లు, 2021-22లో 2,039 కోట్ల యూనిట్లు, 2022-23లో 2,268 కోట్ల యూనిట్లు, 2023-24లో 2,547 కోట్ల యూనిట్లు విద్యుదుత్పత్తి జరిగిందని అధికారులు తెలిపారు.

### పెరిగిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, ఏప్రిల్ 3: రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం మంగళవారం 430.13 కోట్ల యూనిట్లుగా నమోదైంది. అంతకు ముందు అత్యధిక విద్యుత్ వినియోగం గత మార్చి 29వ తేది విద్యుత్ వినియోగం 426.44 కోట్ల యూనిట్లుగా ఉంది. వినియోగం అధికమైనా విద్యుత్ కొరత లేకుండా సరఫరా చేస్తున్నట్లు విద్యుత్ బోర్డు తెలియజేసింది.

### సహకార శాఖలో ఈ-ఆఫీస్

ఐసిఎఫ్, ఏప్రిల్ 3: సహకార శాఖలో ఈ-ఆఫీస్ విధానం అమల్లోకి వచ్చింది. ఈ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సహకార బ్యాంకులు, సహకార సంఘాలు, మండల జాయింట్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, డిప్యూటీ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, వస్తువుల కొనుగోలు వంటి శాఖాపరమైన అన్ని పనులు కాగితపు ఫైళ్ల ద్వారానే జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఫైళ్లు కనిపించకుండా పోవడం, అవకతవకలు జరుగుతున్నాయి. వీటిని అడ్డుకొనేలా ఈ-ఆఫీస్ విధానం అమల్లోకి తీసుకువచ్చారు. 350 మందికి పైగా అధికారులకు ఈ-ఆఫీస్ నిర్వహణపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

### ప్రత్యేక రైళ్లు పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 3: ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ● నెం.06067/06068 ఎగ్మూర్ - నాగర్‌కోయిల్ - ఎగ్మూర్ వారాంతపు ప్రత్యేక వందేభారత్ రైళ్లు (గురువారం) ఈనెల 4నుంచి 25వతేది వరకు పొడిగించారు.

● నెం.06030 తిరునల్వేలి - మేట్టుపాళయం వారాంతపు ప్రత్యేక రైలు (ఆదివారం) ఈనెల 7 నుంచి 26వ తేది వరకు పొడిగించారు. అలాగే, నెం.06029 మేట్టుపాళయం - తిరునల్వేలి ప్రత్యేక వారాంతపు రైలు (సోమవారం) ఈనెల 8 నుంచి 27వ తేది వరకు పొడిగించారు.

### రేపు ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, ఏప్రిల్ 3: స్థానిక చెపాక్ క్రికెట్ స్టేడియంలో ఈ నెల 8వ తేది జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌కు టిక్కెట్ల విక్రయాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఐపీఎల్ మ్యాచ్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్ - కోల్‌కత్తా నైట్ రైడర్స్ మధ్య ఈనెల 8న సోమవారం రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టిక్కెట్ల విక్రయాలు 5వ తేది ఉదయం 9.30 గంటలకు ఆన్‌లైన్‌లో ప్రారంభమవుతుందని సీఎస్‌కే యజమాన్యం తెలిపింది.

### క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఏప్రిల్ 3: క్రీడాకారుల కోటాలో విద్యార్థులను ఉచితంగా చేర్చుకొనేందుకు నిర్వహించే పరీక్షకు లయోలా కళాశాల, సెమ్మంజేరి జేపీయార్ కళాశాలలు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. నుంగంబాక్కంలో ఉన్న లయోలా కళాశాలలో క్రీడాకారుల కోటా సీట్లకు ఎంపిక శిబిరం ఈనెల 6 నుంచి 8వ తేది వరకు జరగనుంది. వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ సహా 8 పోటీలకు ఎంపిక జరగనుంది. వివరాలకు నెం.9629522111 లో సంప్రదించవచ్చు. జేపీయార్ వర్సిటీలో 4 నుంచి 18వ తేది వరకు కళాశాల ప్రాంగణంలో ఎంపిక జరగనున్నాయి. వివరాలకు నెం.9444611278లో సంప్రదించవచ్చు.

### ఎంజీఆర్ వర్సిటీలో సిమ్యులేషన్ ల్యాబ్

ఐసిఎఫ్, ఏప్రిల్ 3: వైద్య విద్యార్థులు శిక్షణ పొందేలా సిమ్యులేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ఉప కులపతి నారాయణస్వామి తెలిపారు. రోగులకు ఇంజెక్షన్ వేయడం, శస్త్రచికిత్స వంటి వివిధ విధానాలపై శిక్షణ ఇచ్చేలా ఈ ల్యాబ్ ఏర్పాట కానుందని, ఇందులో శిక్షణ పొందే విద్యార్థులు 100 శాతం నైపుణ్యం సంపాదించుకోగలుగుతారని తెలిపారు.

### దివ్యాంగులకు ఎంటీసీ అనుమతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 3: దివ్యాంగులు కొత్త ట్రావెల్ కార్డును ఆన్‌లైన్ ద్వారా పొందే వరకు ప్రస్తుతమున్న పాత కార్డు చూపించి బస్సుల్లో ప్రయాణించవచ్చని ఎంటీసీ సూచించింది. దివ్యాంగులను పాత కార్డులతో బస్సుల్లో ప్రయాణించేందుకు అనుమతించేలా చర్యలు చేపట్టాలని శాఖ మేనేజర్లకు ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీజాన్ ఉత్తర్వులు జారీ చేశారు.

### రేపటినుంచి వందేభారత్ సేవల పొడిగింపు

ఐసిఎఫ్, ఏప్రిల్ 3: చెన్నై సెంట్రల్ - బెంగళూరు వందే భారత్ రైలు సేవలు ఈ నెల 5వ తేది నుంచి మైసూరు వరకు పొడిగించనున్నారు. చెన్నై సెంట్రల్ - మైసూరు వందే భారత్‌ను మార్చి 12న ప్రారంభించారు. ఈ రైలు ఈనెల 4వ తేది వరకు చెన్నై సెంట్రల్ - బెంగళూరు మధ్య బుధవారం మినహా మిగిలిన అన్ని రోజులు నడుస్తాయని ప్రకటించారు. సెంట్రల్ నుంచి సాయంత్రం 5 గంటలకు బయల్దేరే ఈ రైలు రాత్రి 9.15 గంటలకు బెంగళూరుకు, మరో మార్గంలో బెంగళూరు నుంచి ఉదయం 7.50 గంటలకు బయల్దేరే వందేభారత్ మధ్యాహ్నం 12.25 గంటలకు చెన్నై సెంట్రల్‌కు చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో, ఈ రైలు సేవలు 5వ తేది నుంచి మైసూరు వరకు పొడిగించనున్నారు. మైసూరు నుంచి ఉదయం 6 గంటలకు బయల్దేరి చెన్నై సెంట్రల్‌కు మధ్యాహ్నం 12.25 గంటలకు చేరుతుంది. మరో మార్గంలో చెన్నై సెంట్రల్ నుంచి సాయంత్రం 5 గంటలకు బయల్దేరి రాత్రి 11.20 గంటలకు మైసూరు చేరుకుంటుంది. వారంలో గురువారం మినహా ఈ రైలు సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు.

### భారతీయార్ వర్సిటీలో ఎంఫిల్ కోర్సుల నిలిపివేత

ప్యారీస్, ఏప్రిల్ 3: భారతీయార్ వర్సిటీలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఎంఫిల్ కోర్సుల అడ్మిషన్లు నిలిపి వేయనున్నట్లు వర్సిటీల రిజిస్ట్రార్ రూప పేర్కొన్నారు. నగరంలో ఆమె బుధవారం మీడియాతో మాట్లాడుతూ... కోయంబత్తూర్‌లో ఉన్న భారతీయార్ వర్సిటీలో పీహెచ్‌డీ గ్రేడ్ నిబంధనల ప్రకారం 2024-25వ విద్యా సంవత్సరం నుంచి ఎంఫిల్ కోర్సులకు సంబంధించిన అడ్మిషన్లు ఉండవని, ఎట్టి పరిస్థితుల్లోను ఈ వర్సిటీ ఆధీనంలో ఉన్న అనుబంధ కళాశాలల్లో కూడా అడ్మిషన్లు చేపట్టరాదని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

# మహిళా ఓటర్లు అధికం

● కానీ పోటీచేసే వారు అత్యల్పం



పెరంబూర్, ఏప్రిల్ 3: రాష్ట్రంలో పదేళ్లలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికమయ్యారు. కానీ, ఎన్నికల్లో పోటీ చేసే పురుషులతో పోల్చితే 10 శాతం లోపే బరిలో ఉంటున్నారు. రాష్ట్రంలో 2011 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 4.71 కోట్ల మంది కాగా, వారిలో పురుషులు 2.37 కోట్లు, మహిళలు 2.34 కోట్లుగా ఉన్నారు. ఈ సంఖ్య తదుపరి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పూర్తిగా మారింది. ఓటరు జాబితాల మహిళా ఓటర్లు అధికమయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 5.50 కోట్లుగా ఉంది. వారిలో పురుషులు 2 కోట్లా 75 లక్షలా 18 వేలు, మహిళలు 2 కోట్లా 75 లక్షలా 21 వేలుగా ఉంది. ఓటరు జాబితా ప్రకారం పురుషుల కంటే మహిళా ఓటరుల అధికమైనా, పోటీచేసే అభ్యర్థుల పరంగా వెనుకంజలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో 789 మంది పోటీ చేయగా 55 మంది మాత్రమే మహిళలు. ఇక, 2019 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం పురుషుల కన్నా మహిళలు 6 లక్షల మంది అధికంగా ఉన్నారు. ఆ ఎన్నికల్లో 757 మంది అభ్యర్థులు కాగా, వారిలో మహిళలు 64 మంది మాత్రమే.

**11 లక్షలకు పెరిగిన మహిళా ఓటర్లు....**

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన ఓటరు జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 6.23 కోట్ల మందిగా ఉండగా, వారిలో పురుషులు 3.06 కోట్లు, మహిళా ఓటర్లు 3.17 కోట్లుగా ఉన్నారు. ఆ ప్రకారం, పురుషుల కన్నా 11 లక్షలు అధికంగా మహిళా ఓటర్లు ఉన్నారు. ప్రస్తుత ఎన్నికల బరిలో 950 మంది అభ్యర్థులుండగా వారిలో 76 మంది మహిళలు మాత్రమే. ముఖ్యంగా, మధ్య చెన్నై, వేలూరు, విల్లుపురం, సేలం, పొల్లాచ్చి, తంజావూరు తదితర లోక్‌సభ నియోజకవర్గాల్లో ఒక్క మహిళ కూడా పోటీ చేయడం లేదు. ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినా, అది ఎప్పటి నుంచి అమలవుతుందో స్పష్టత లేదు. ఆ ప్రకారం, రాజకీయ పార్టీలు ఇష్టపడితేనే మహిళలు పోటీ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

### అగ్నిమాపక పరికరాల తనిఖీ

ఐసిఎఫ్, ఏప్రిల్ 3: ఆసుపత్రుల్లో అగ్నిమాపక పరికరాలను తనిఖీ చేయాలని జిల్లా ఆరోగ్య అధికారులకు ఆ శాఖ డైరెక్టర్ సెల్వవినాయగం ఉత్తర్వులు జారీ చేశారు. వేసవి ఎండలకు ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలను అడ్డుకొనేలా చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఉన్న ఈ పరికరాలను తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.

### విద్యుత్ ప్రమాదాలను అడ్డుకొనేలా అలారం

ఐసిఎఫ్, ఏప్రిల్ 3: విద్యుత్ ప్రమాదాలను అడ్డుకొనేలా ఆధునిక అలారాలను ఏర్పాటు చేయనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది. కేబుల్, విద్యుత్ స్తంభాలు, పిల్లర్ బాక్సులు, ట్రాన్స్‌ఫార్మర్ల ద్వారా విద్యుత్ బోర్డు విద్యుత్ సరఫరా చేస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్లలో ఫీజు పోవడం వంటివి జగినప్పుడు ఉద్యోగులు మరమ్మతులు చేపట్టేందుకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో స్విచ్‌ఆఫ్ చేయకుండానే మరమ్మతులు చేపడుతుండడంతో ప్రమాదాలకు లోనవుతుంటారు. ఈ తరహా ప్రమాదాలను అడ్డుకునేలా సెన్సార్‌తో కూడిన అలారాలు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ బోర్డు చర్యలు చేపట్టింది.

### అద్దె భవనాల్లోకి సీఈఓ, డీఈఓ కార్యాలయాలు

పెరంబూర్, ఏప్రిల్ 3: ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో పనిచేస్తున్న సీఈఓ, డీఈఓ కార్యాలయాలను సత్వరం మార్చాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాల ప్రాంగణాల్లో పని చేస్తున్న కార్యాలయాలతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉంటోందని, అందువల్ల ఆ కార్యాలయాలను ఈనెల 10వ తేదిలోపు ఖాళీ చేసి అద్దె భవనాల్లో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా 151 విద్యా కార్యాలయాలు అద్దె భవనాల్లోకి మారనున్నాయి.

### విద్యార్థినికి అసభ్య చిత్రాలు

● ప్రొఫెసర్ సస్పెన్షన్

పెరంబూర్, ఏప్రిల్ 3: విద్యార్థినికి అసభ్య చిత్రాలు పంపిన ప్రొఫెసర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. మైలాడుదురై ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చరిత్ర విభాగ సహాయక ప్రొఫెసర్ రామర్, కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని సెల్‌ఫోన్‌కు అసభ్య చిత్రాలు పంపినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన కళాశాల విద్య డైరెక్టర్, సహాయ ప్రొఫెసర్ రామర్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

### దక్షిణ రైల్వే ఆదాయం రూ.12,020 కోట్లు

● నిరుడు కంటే 20 శాతం అధికం

అడయార్, ఏప్రిల్ 3: దక్షిణ రైల్వేకు ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.12,020 కోట్ల మేరకు ఆదాయాన్ని అర్జించింది. ఇది గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 20 శాతం అధికం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో దక్షిణ రైల్వే అన్ని రంగాల్లో పురోగతి సాధించింది. ఈ ఆర్థిక సంత్సరంలో చెన్నై - కోయంబత్తూరు, చెన్నై - విజయవాడ, కోయంబత్తూరు - బెంగళూరు, నెల్లై - చెన్నైతో సహా మొత్తం 8 వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టినట్టు పేర్కొంది. అలాగే, రైళ్ల వేగాన్ని పెంచేందుకు వీలుగా అరక్కోణం - జోలార్‌పేట మార్గంలో 130 కిలోమీటర్ల వేగంతో నడిపేలా ట్రాక్‌ను ఆధునికీకరించినట్టు పేర్కొంది. పలు ప్రాంతాల మధ్య విద్యుద్దీకరణ, రైల్వే ట్రాక్ పటిష్ఠపరచడం వంటి పనులు చేపట్టినట్టు తెలిపింది.

### ఆళ్వార్‌పేటలో ట్రాఫిక్ మార్పులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 3: స్థానిక ఆళ్వార్‌పేటలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనుల కారణంగా వారం రోజులు ట్రాఫిక్ మార్పులు అమల్లో ఉంటాయి.

● టీటీకే రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు మ్యూజిక్ అకాడమీ సమీపంలో కుడివైపు తిరిగి కస్తూరి రంగన్ రోడ్డు మీదుగా కేథడ్రల్ రోడ్డు చేరుకోవాలి.

● బిషప్ వేల్స్ ఈస్ట్ రోడ్డు మీదుగా కేథడ్రల్ రోడ్డుకు వెళ్లే వాహనాలు మ్యూజిక్ అకాడమీ జంక్షన్‌లో యూ టర్న్ తీసుకొని నీలగిరీస్ ఫ్లై ఓవర్ మీదుగా కేథడ్రల్ రోడ్డుకు చేరుకోవాలి.

● వీపీ రామన్ రోడ్డు, లాయడ్స్ రోడ్డు, ఇండియన్ బ్యాంక్ జంక్షన్ నుంచి టీటీకే రోడ్డు మీదుగా వెళ్లే వాహనాలు ఎడమ వైపు తిరిగి నీలగిరీస్ జంక్షన్‌లో యూటర్న్ తీసుకొని ఫ్లై ఓవర్ మీదుగా కేథడ్రల్ రోడ్డు చేరుకోవాలి.

● జేజే రోడ్డు, అంబుజమ్మాళ్ వీధి, పార్థసారథి గార్డెన్ మీదుగా వచ్చే వాహనాలు మ్యూజిక్ అకాడమీ జంక్షన్‌లో కుడివైపు తిరిగి నీలగిరీస్ జంక్షన్‌లో యూటర్న్ తీసుకొని ఫ్లై ఓవర్ మీదుగా కేథడ్రల్ రోడ్డుకు వెళ్లాలి.

### సెమ్మంగుళంలో చిరుత సంచారం



సీసీ కెమెరాలో నమోదైన చిరుత, రహదారి ఇసుకలో నమోదైన చిరుత కాలి ముద్రలు

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా కూరైనాడు సెమ్మంగుళం సమీపంలో మంగళవారం అర్ధరాత్రి చిరుత పరుగులు తీయడాన్ని పాదచారులు బిత్తరపోయారు. వెంటనే పోలీసులు, అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో సీసీ కెమెరాల్లో నమోదైన వీడియో దృశ్యాలు పరిశీలించారు. అందులో ఓ చిరుత వీధి కుక్కలను తరుముకుంటూ వెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. ఆ రహదారి పక్కగా చిరుత కాలి ముద్రలు నమోదై ఉండటాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ మహాభారతి ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ ప్రాంతానికి చేరువుగా ఉన్న ఓ ప్రైవేటు స్కూలుకు సెలవు ప్రకటించారు. అటవీ శాఖాధికారులు మాట్లాడుతూ వేసవి ప్రారంభం కావడంతో తాగునీటి కోసం వచ్చి ఉంటుందన్నారు.

### 10 యేళ్లలో 108 సార్లు పెట్రోల్ ధరల పెంపు

● ఎంపీ తిరుచ్చి శివ

అడయార్, ఏప్రిల్ 3: గత దశాబ్దకాలం బీజేపీ పాలనలో ఏకంగా 108 సార్లు పెట్రోల్ ధర పెంచారని డీఎంకే రాజ్యసభ సభ్యుడు తిరుచ్చి శివ చెప్పారు. మంగళవారం కుంభకోణంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగిస్తూ... కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు జరిపిన ఉద్యమంలో పలువురు రైతులు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ చట్టాలకు దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం కావడంతో వాటిని వెనక్కి తీసుకున్నారన్నారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం దేశ ప్రజలు, రైతుల కోసం పనిచేయడం లేదని కేవలం కార్పొరేట్ శక్తుల కోసమే ఉందన్నారు.

### వారాంతపు సెలవుల సందర్భంగా ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఏప్రిల్ 3: వారాంతపు రోజులు, శుభముహూర్తాల సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈనెల 5న శుక్రవారం నుంచి ఆదివారం వరకు నగరం నుంచి వెళ్లేందుకు, ఇతర నగరాల నుంచి నగరానికి వచ్చేందుకు అనుకూలంగా ప్రత్యేక బస్సులు నడపనున్నారు. కీలంబాక్కం నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈనెల 5వ తేది 265 ప్రత్యేక బస్సులు, 6న 350 బస్సులు, కోయంబేడు నుంచి వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు 5వ తేది 66 ప్రత్యేక బస్సులు, 6న 65 బస్సులు నడపనున్నామని తెలిపింది. అలాగే అయా ఊర్లకు వెళ్లిన వారు తిరిగొచ్చేలా ఈనెల 7న ఆదివారం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రవాణా సంస్థ తెలిపింది.

### వీఐటీ వర్సిటీలో విద్యా రుణాల పంపిణీ



విద్యార్థులకు రుణాలు అందజేస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి వాసుకి

వేలూరు, ఏప్రిల్ 3: స్థానిక కాట్పాడిలోని వీఐటీ విశ్వవిద్యా లయం ఆధ్వర్యంలో బుధవారం 'ఉన్నత విద్యా ట్రస్ట్' తరపున పేద విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా విద్యా రుణాలు అందజేశారు. కార్యక్రమానికి వర్సిటీ చాన్సలర్ విశ్వనాథన్ అధ్యక్షత వహించగా, మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి వాసుకి ముఖ్యఅతిథిగా హాజరై, 600 మంది విద్యార్థులకు రూ.68.38 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ న్యాయమూర్తి మాట్లాడుతూ... మహిళలు ఉన్నత విద్యలో రాణిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఉన్నత విద్య అభ్యసించేందుకు మహిళలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మంగలాంబిక్తై, డార్లింగ్ గ్రూప్ వెంకటసుబ్బు, రుగ్బీ జైన్ తదితరులు పాల్గొన్నారు.

### లక్నో సూపర్ జెయింట్స్‌తో వాల్వోలైన్ భాగస్వామ్యం




చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లూబ్రికెంట్స్, ఇంజిన్ ఆయిల్స్ తయారీలో ప్రఖ్యాతిగాంచిన వాల్వోలైన్ ఇండియా సంస్థ ఇండియన్ ప్రీమియం లీగ్ (ఐపీఎల్ 2024) పోటీల్లో పాల్గొంటున్న లక్నో సూపర్ జెయింట్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుందని సంస్థ సీఈఓ ఇప్సితా చౌదరి తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన జారీ చేస్తూ ఐపీఎల్ 2024కి అధికారిక భాగస్వామిగా లక్నో సూపర్ జెయింట్స్‌తో చేరడం వాల్వోలైన్ ఇండియాకు థ్రిల్లింగ్ అవకాశం అని ఆమె పేర్కొన్నారు. తమ సంస్థ నైపుణ్యతతో లక్నో సూపర్ జెయింట్స్‌తో భాగస్వామ్యం మైదానంలో, వెలుపలా నైపుణ్యాలను పెంపొందించడానికి తనవంతు సేవలను అందిస్తుందని ఆమె వివరించారు.

### ఊటీలో అకాల వర్షం



చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలో అరగంటసేపు కురిసిన అకాల వర్షానికి వాతావరం చల్లబడింది. స్థానికులు, పర్యాటకులకు ఈ వాన ఊరటనిచ్చింది. ఇటీవల ఊటీ పరిసరాలల్లో ఎండవేడిమి అధికమైంది. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగాయి. దీనితో చల్లటి నగరంగా పేరుగాంచిన ఊటీ వడగాడ్పులతో సతమతమైంది. యేటా జనవరి నుంచి మార్చి లోగా రెండుమూడు భారీ వర్షాలు కురవడం ఆనవాయితీగా ఉండేది. అయిత ఈ యేడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ చినుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో ఊటీ పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టుండి అరగంటసేపు భారీ వర్షం కురిసింది. రహదారుల్లో నీరు ప్రవహించింది. దీంతో స్థానికులు, పర్యాటకులు ఆనందంతో ఉద్యానవనాల్లో సందడి చేశారు.

### ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష



సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న ఎన్నికల అధికారి సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 3: వేలూరు లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల్లో కేవీ కుప్పం అసెంబ్లీ నియోజక వర్గంలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లపై ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సమస్యాత్మక కేంద్రాలు, ఆ కేంద్రాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై ఎన్నికల అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో ఎన్నికల ఉప అధికారి సుమతి, బీడీఓ సంతోష్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మాజీ ప్రధాని మన్మోహన్‌కు స్టాలిన్ అభినందనలు

అడయార్, ఏప్రిల్ 3: గత 33 యేళ్లుగా రాజ్యసభ సభ్యుడిగా ఉంటూ వచ్చిన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పదవీకాలం బుధవారంతో ముగిసింది. దీంతో ఆయనకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అభినందనలు తెలిపారు. ఇదే విషయంపై సీఎం బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాజ్యసభ సభ్యుడిగా 33 యేళ్ళుగా కొనసాగారని గుర్తు చేశారు. ఆయన తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన శుభసందర్భంలో ఆయనకు రాష్ట్ర ప్రజలు, డీఎంకే తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్టు సీఎం వెల్లడించారు.

### నామక్కల్‌లో రూ.4.5 కోట్ల నగదు స్వాధీనం

పెరంబూర్, ఏప్రిల్ 3: నామక్కల్ జిల్లాలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో రూ.4.5 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. మోగనూరు సమీపం గాంధీనగర్‌లో నివసిస్తున్న ఆమ్నీ బస్సు యజమాని చంద్రశేఖర్ ఇంటి నుంచి ఓటర్లకు నగదు బట్వాడా జరుగుతోందని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో, బుధవారం ఉదయం నుంచి చంద్రశేఖర్ ఇంట్లో తనిఖీలు చేపట్టిన అధికారులు, లెక్కల్లో చూపని రూ.4.5 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు.

### బంగారు పుస్తకంగా 'శ్రీరామచరిత్ మానస్'

● ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ సృష్టి



ప్రదర్శనకు ఉంచిన 'శ్రీరామచరిత్ మానస్' వద్ద తల్లి శ్యామలతో అమరేంద్రన్ ఉమ్మిడి

అడయార్, ఏప్రిల్ 3: నగరంలోని ప్రముఖ బంగారు ఆభరణాల తయారీ సంస్థల్లో ఒకటైన ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ అద్భుతాన్ని సృష్టించింది. బంగారు పూత పూసిన పేజీలపై రుషి గోస్వామి తులసీదాస్ 'శ్రీరామచరిత్ మానస్' పురాణాన్ని పుస్తక రూపంలో రూపొందించింది. ఇది కళాకారుల నైపుణ్యానికి, భక్తికి ప్రతీకగా నిలిచింది. అన్నాసాలైలోని ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్‌లో దీన్ని ప్రదర్శనకు ఉంచారు. మొత్తం 522 బంగారు పూత పూసిన పేజీలతో తయారు చేశారు. ఇందులోని అన్ని పుటలు శ్రీరాముడిని కీర్తిస్తున్నాయి. ఒక్కో పేజీ మిల్లీమీటర్ మందంతో సూక్ష్మంగా రూపొందించినట్టు ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ అమరేంద్రన్ ఉమ్మిడి, ఆయన తల్లి శ్యామల ఉమ్మిడి పేర్కొన్నారు. దీన్ని అయోధ్యకు తరలించి అక్కడి మందిరం గర్భగుడిలో ఉంచనున్నట్లు వారు పేర్కొన్నారు.

### ఎన్నికల పెళ్లిలో వరుడు మా పార్టీయే

● మాజీ మంత్రి సెల్లూరు రాజు

ప్యారీస్, ఏప్రిల్ 3: ఎన్నికలు అనే పెళ్లికి ప్రధాని నరంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా వంటి పెద్దలు వచ్చినా వరుడు మాత్రం అన్నాడీఎంకేనని మాజీ మంత్రి సెల్లూరు రాజు ఛలోక్తులు విసిరారు. ఆలయాల నగరం మదురైలో అన్నాడీఎంకేకు మద్దతు గా క్రైస్తవ, ఇస్లాం మతగురువులతో భేటీ అయిన సెల్లూరు రాజు ఈ ఎన్నికల్లో రెండాకులు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ఈ నెల 19న జరుగనున్న సార్వత్రిక ఎన్నికల ప్రచారం కోసం ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు వస్తున్నారని, హీరో పెళ్లి కుమారుడేనని, మిగతా వారంతా నూతన దంపతులను ఆశీర్వదించేందుకు వచ్చే వారంటూ చమత్కరించారు. అన్నాడీఎంకే అధినేత్రి జయలలిత మరణించిన అనంతరం పార్టీ ఎదుర్కొన్న అన్ని ఎన్నికల్లో ఓటమి పాలైందని ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ వ్యాఖ్యానించడంపై స్పందించిన సెల్లూర్ రాజు... దినకరన్ జాతకాలు చెప్పడం తనకు ఇప్పుడే తెలిసిందన్నారు.

### ఈసీ నిఘా ముమ్మరం

పెరంబూర్, ఏప్రిల్ 3: రాష్ట్రంలోని ప్రధాన పార్టీలకు చెందిన నేతలపై ఎన్నికల కమిషన్ డేగ కన్నుతో పర్యవేక్షిస్తోంది. ఆ క్రమంలో, మంగళవారం ఒకే రోజు ప్రధాన పార్టీలకు చెందిన నేతలు, వారి అనుచరుల ఇళ్లలో తనిఖీలు చేపట్టి సుమారు రూ.4 కోట్ల నగదు స్వాధీనం చేసుకుంది. బుధవారం సేలంలోని ప్రధాన పార్టీ నగర కార్యదర్శి ఇల్లు సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

### మోదీ మళ్లీ ప్రధాని అయితే రేషన్ దుకాణాలుండవు

● డీపీఐ అధినేత తిరుమా

పెరంబూర్, ఏప్రిల్ 3: మోదీ మళ్లీ ప్రధాని అయితే దేశంలో రేషన్ దుకాణాలుండవని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ అన్నారు. చిదంబరం నియోజకవర్గంలో డీఎంకే కూటమిలో పోటీ చేస్తున్న తిరుమా... బుధవారం ఆలత్తూర్‌లో జరిగిన ప్రచార సభలో ప్రసంగించారు. బీజేపీ మళ్లీ అధికారం చేపడితే 100 రోజుల ఉపాధి హామీ పథకం నిలిపివేస్తుందన్నారు. పేదలు రుణంగా తీసుకున్న రూ.50,000 వసూలుకు బ్యాంక్ అధికారులు ఇళ్ల వద్దకు వెళ్లి నిర్బంధిస్తుండగా, మోదీ స్నేహితులైన అదానీ తదితరులు బ్యాంకుల్లో తీసుకున్న వేల కోట్ల అప్పును మాఫీ చేశారని ధ్వజమెత్తారు. అదే సమయంలో మతవాదాన్ని ముందుకు తీసుకొచ్చి ఈ ఎన్నికల్లో లబ్ధిపొందాలని బీజేపీ యత్నిస్తుందని విమర్శించారు.

### రాజ్యసభ ఎంపీగా మురుగన్ పదవీప్రమాణం



ప్రమాణం చేస్తున్న మురుగన్

పెరంబూర్, ఏప్రిల్ 3: కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ రాజ్యసభ సభ్యుడిగా బుధవారం పదవీ ప్రమాణం చేశారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ జగదీప్ ధన్‌కర్ సమక్షంలో మురుగన్ రాజ్యసభ ఎంపీగా ప్రమాణం చేశారు. మధ్యప్రదేశ్ నుంచి రెండో సారి రాజ్యసభ ఎంపీగా మురుగన్‌ను బీజేపీ అధిష్ఠానం ఎంపిక చేసింది. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో నీలగిరి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా ఎల్.మురుగన్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

### బీజేపీ గెలిస్తే దేశంలో ఎన్నికలే ఉండవు

● సీపీఎం నేత రంగరాజన్

అడయార్, ఏప్రిల్ 3: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మళ్లీ గెలిచి అధికారంలోకి వస్తే భవిష్యత్తులో ఎన్నికలు ఉండవని సీపీఎం సీనియర్ నేత టీకే రంగరాజన్ అన్నారు. తూత్తుక్కుడిలో పోటీ చేస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళికి మద్దతుగా మంగళవారం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. పదేళ్లుగా సాగుతున్న బీజేపీ పాలనను గద్దె దించాలని ఆయన పిలుపునిచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం దేశానికి కీలక మలుపుకానుందన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీకి క్రమంగా ఆదరణ తగ్గిపోతోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తోందన్నారు. గత పదేళ్లలో ప్రధాని మోదీ తలచుకునివుంటే కచ్చాదీవిని తిరిగి స్వాధీనం చేసుకుని ఉండొచ్చన్నారు. గతంలో ప్రభుత్వ అధికారిగా ఉండి ఇపుడు దేశ విదేశాంగ మంత్రిగా ఉన్న ఒక వ్యక్తి ఫక్తు రాజకీయ నేతగా మారిపోయి, కచ్చాదీవిని డీఎంకే శ్రీలంకకు దారాదత్తం చేసిందంటూ రాజకీయ ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

### ద్రావిడ పాలనలో నిరంతరాయ విద్యుత్

● మంత్రి తంగం తెన్నరసు

పెరంబూర్, ఏప్రిల్ 3: ద్రావిడ మోడల్ ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యల కారణంగా విద్యుత్ కోతలు లేని రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందని మంత్రి తంగం తెన్నరసు తెలిపారు. నగరంలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ... కర్మాగారాలు, వాణిజ్య సంస్థలు, అన్నదాతలు, గృహిణులు ఎవ్వరూ ఇబ్బందులు పడకుండా విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. అదనపు విద్యుత్ డిమాండ్, వినియోగం ఉన్నా వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేలా చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు.

### అన్నాడీఎంకే నేత ఇంట్లో నగదు, నగల స్వాధీనం

అడయార్, ఏప్రిల్ 3: సేలం జిల్లా తారామంగళంలో అన్నాడీఎంకే పట్టణ విభాగం కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం నివాసంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బుధవారం తెల్లవారుజామున జరిపిన ఆకస్మిక తనిఖీల్లో రూ.కోటి విలువైన బంగారు ఆభరణాలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈయన నివాసంలో భారీ మొత్తంలో నగదు, నగలను నిల్వ ఉంచినట్టు ఎన్నికల అధికారులకు సమాచారం అందింది. దీంతో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆయన ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. మొత్తం 3 గంటల పాటు జరిపిన ఈ తనిఖీల్లో రూ.కోటి విలువైన నగలు, నగదును స్వాధీనం చేసుకున్నారు.

### సెంట్రల్ స్టేషన్‌లో ...

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ముంబైకి చెందిన కుమన్‌సింగ్ తాహియా అనే ప్రయాణికుడి నుంచి రూ.6.40లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వేకువజాము మూడో ప్లాట్‌ఫాంపై నిలిచిన నవజీవన్ ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన ప్రయాణికులను తనిఖీ చేశారు. కుమన్‌సింగ్ తాహియా బ్యాగ్‌ను తనిఖీ చేయగా కరెన్సీ నోట్లు కనిపించాయి. వెంటనే ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు సమాచారం అందించగా వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. అతడి వద్ద నగదుకు సంబంధించి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.

**13 కిలోల బంగారం స్వాధీనం...**

రాశిపురం వద్ద బుధవారం ఉదయం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు జరిపిన తనిఖీల్లో 13 కిలోల బంగారం పట్టుబడింది. సేలం - నామక్కల్ జిల్లాల సరిహద్దు ప్రాంతమైన మల్లూరు వద్ద సేలం నుంచి వెళుతున్న కొరియర్ వాహనాన్ని నిలిపి సోదా చేశారు. అందులో రూ.8.79 కోట్ల విలువైన 13 కిలోల బంగారం, 33 కిలోల వెండి ఆభరణాలు న్నాయి. వాటికి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు.

### నా కుమారుడికి సీటు రాలేదని అసంతృప్తి లేదు: స్పీకర్ అప్పావు

పెరంబూర్, ఏప్రిల్ 3: తిరునెల్వేలి లోక్‌సభ స్థానంలో తన కుమారుడికి సీటు రాలేదని అసంతృప్తిలో ఉన్నానంటూ వస్తున్న వార్తలు నిరాధారమైనవని అసెంబ్లీ స్పీకర్ అప్పావు తెలిపారు. తిరునెల్వేలి జిల్లా నాగర్‌కోయిల్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నెల్లై లోక్ సభస్థానం నుంచి డీఎంకే తరపున పోటీ చేసేందుకు 44 మంది దరఖాస్తులు సమర్పించారన్నారు. కానీ, కూటమి సర్దుబాటులో భాగంగా సీటును కాంగ్రెస్‌కు కేటాయించారని తెలిపారు.

### కారు ఢీకొని తిరువళ్లూరువాసి మృతి

తడ, ఏప్రిల్ 3: కారు ఢీకొని తిరువళ్లూరువాసి మృతి చెందాడు. ఈ ఘటన ఆంధ్ర రాష్ట్రం తడ మండలంలోని రామాపురం జాతీయ రహదారి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పొదువళ్లూరుకు చెందిన ఎం.వెంకటేశన్ బేల్దారి. మంగళవారం గుమ్మిడిపూండిలో ఉన్న తన స్నేహితుడితో కలిసి తడ మండలం రామాపురం పంచాయతీ వెంకటాద్రిపాళెంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో తిరిగి గుమ్మిడిపూండికి బయలుదేరాడు. మార్గమధ్యంలో రామాపురం జాతీయ రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశన్ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● వీఐపీ నియోజకవర్గం

# తెన్‌కాశిలో త్రిముఖ పోరు



డాక్టర్ కృష్ణసామి (పుదియ తమిళగం), డాక్టర్ రాణి శ్రీకుమార్ (డీఎంకే), జాన్‌పాండ్యన్ (తమిళగ మున్నేట్ర కళగం)

ప్యారీస్, ఏప్రిల్ 3: రాష్ట్రంలోని కొన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో కీలక నేతలు... సీనియర్ నేతలు... సిట్టింగ్ ఎంపీల మధ్య ఆసక్తికర పోరు జరగనుంది. అలాంటి నియోజకవర్గాల్లో తెన్‌కాశి ఒకటి. ఈ రిజర్వ్ స్థానం నుంచి డీఎంకే తరఫున డాక్టర్ రాణి శ్రీకుమార్, బీజేపీ కూటమిలో తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం రాష్ట్ర అధ్యక్షుడు జాన్ పాండ్యన్, అన్నాడీఎంకే కూటమిలో పుదియ తమిళగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కృష్ణసామి మధ్య ఉత్కంఠ భరిత పోరు జరగనుంది.

మొత్తం ఓటర్లు: 15,16,183
పురుషులు: 7,42,158
మహిళలు: 7,73,822
ఇతరులు: 203

### 2019 ఎన్నికల ఫలితాలు...

ఈ నియోజవర్గంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మొదటి సారిగా డీఎంకే అభ్యర్థి ఎం.కుమార్ పోటీచేసి 4,76,156 ఓట్లతో విజయం సాధించారు. పుదియ తమిళం అభ్యర్థి డాక్టర్ కృష్ణసామి 3,45,870 ఓట్లతో ద్వితీయస్థానంలో నిలిచారు. ఈసారి ఎం.కుమార్ పోటీ చేసే అవకాశం లేకపోవడంతో డీఎంకే అభ్యర్థిగా శంకరన్‌కోయిల్‌కు చెందిన రాణి శ్రీకుమార్ బరిలో నిలిచారు.

### కాంగ్రెస్ కోట...

1957 నుంచి కాంగ్రెస్ వరుసగా 9 సార్లు విజయం సాధించి తన కంచుకోటగా మార్చుకున్న తెన్‌కాశి లోక్‌సభ స్థానంలో అన్నాడీఎంకే మూడు సార్లు, సీపీఐ రెండు సార్లు, తమిళ మానిల కాంగ్రెస్, డీఎంకేలు తలా ఒకసారి గెలిచాయి. 1977, 1980, 1984, 1989, 1991 సంవత్సరాల్లో వరుసగా 5సార్లు కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఎం.అరుణాచలం గెలిచి కాంగ్రెస్ కేంద్రమంత్రి వర్గంలో బెర్తు దక్కించుకున్నారు. అలాగే, 1996లో తమిళ మానిల కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఆయన 6వ సారి ఎంపీగా విజయం సాధించారు.

### పట్టువదలని విక్రమార్కుడిలా....

ఈ స్థానంలో 6 సార్లు పోటీ చేసి ఓటమి పాలైన పుదియ తమిళగం అధినేత డాక్టర్ కృష్ణసామి పట్టువదలని విక్రమార్కుడిలా 2024 సార్వత్రిక ఎన్నికల్లో 7వ సారి అన్నాడీఎంకే కూటమి తరఫున పోటీలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో అన్నాడీఎంకే, బీజేపీ కూటమికి మద్దతు తెలిపిన తమిళగ మక్కల్ మున్నేట్ర కళగం నేత జాన్‌పాండ్యన్ ఈ సారి బీజేపీ కూటమి తరఫున బరిలో నిలిచారు. ఎన్టీకే అభ్యర్థి ఇసై మదివానన్ సహా ఇండిపెండెంట్లు 15 మంది పోటీలో ఉన్న నేపథ్యంలో, డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది.




### అసెంబ్లీ స్థానాలు...

ఈ లోక్‌సభ నియోజకవర్గంలో శంకరన్‌కోయిల్ (రిజర్వుడు), తెన్‌కాశి, కడయనల్లూర్, వాసుదేవనల్లూర్(రిజర్వుడు), విరుదునగర్ జిల్లాలోని శ్రీవిల్లిపుత్తూర్ (రిజర్వుడు), రాజపాళయం అనే ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటిలో ప్రస్తుతం శంకరన్‌కోయిల్, వాసుదేవనల్లూర్, రాజపాళయం నియోజకవర్గాలు డీఎంకే చేతిలో, కడయనల్లూర్, శ్రీవిల్లిపుత్తూర్ అన్నాడీఎంకే ఖాతాలో ఉన్నాయి. ఇక, తెన్‌కాశి అసెంబ్లీని కాంగ్రెస్ చేజిక్కించుకుంది. 1957, 1962 సంవత్సరాల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జనరల్ నియోజకవర్గంగా ఉన్న తెన్‌కాశి ఆ తరువాత రిజర్వుడు నియోజకవర్గంగా కొనసాగుతోంది.దక్షిణ జిల్లాల్లో ఉన్న ఒకే ఒక రిజర్వుడు స్థానం ఇదే కావడం గమనార్హం.

### నెరవేరని హామీలు...

ఐదు జలపాతాలతో నిత్యం విదేశీ, స్వదేశీ పర్యాటకులతో సందడి నెలకొన్న కుట్రాలం ప్రాంతం అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాల్సి ఉంది. వ్యవసాయం, చేనేత, పవర్‌లూమ్, బీడీ పరిశ్రమలు ప్రధానం. తెన్‌కాశి జిల్లాలో సెంట్ ఫ్యాక్టరీ, మ్యాంగో జ్యూస్, నిమ్మ పండ్లకు సంబంధించిన పరిశ్రమలు, జౌళి పార్కు ఏర్పాటు చేయాలని ప్రజల దీర్ఘకాలిక డిమాండ్ కలగానే మిగిలాయి. పశ్చిమ కనుమల్లో ఉన్న షెన్బగవల్లి చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని, వైద్య విద్య కళాశాల ఏర్పాటు, రైలుమార్గం డబ్లింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా ప్రజలు పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూనే ఉన్నారు. అయితే ఎన్నికలు రాగానే వీటిని నెరవేర్చడమే తమ లక్ష్యమని హామీ ఇస్తున్న రాజకీయ పార్టీలు గెలిచాక మాట నిలబెట్టుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.




రామనాథపురం బీచ్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల అవగాహన బోర్డు వద్ద ఫొటోలు తీసుకుంటున్న విదేశీ పర్యాటకులు

## 'ఎన్నికల కష్టం'



దిండుగల్ లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న పీఎంకే అభ్యర్థి తిలకభామ ఎన్నికల ప్రచారం చేస్తూ... దారి మధ్యలో పొలాల్లో పని చేస్తున్న కూలీలను చూశారు. అంతే! హఠాత్తుగా ఆమెకు వారి కష్టం గుర్తుకొచ్చింది. వెంటనే వారి వద్దకెళ్లి పిచికారీ పంపును తీసుకుని ఐదు నిమిషాల పాటు శ్రమించారు. ఫొటో సెషన్ అయ్యాక... ఎంచక్కా వెళ్లిపోయారు మరి!



ఉత్తర చెన్నై నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి పాల్ కనకరాజ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నటి నమిత

## తిరువణ్ణామలైలో స్టాలిన్ ప్రచారం

● ఓట్లవేట

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలో బుధవారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ అక్కడి అరుణాచలేశ్వరాలయ మాడ వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు నీలిరంగు టీషర్ట్, నలుపురంగు ప్యాంట్ ధరించిన స్టాలిన్, మంత్రి ఈవీ వేలు, తిరువణ్ణామలై డీఎంకే అభ్యర్థి సీ.ఎన్.అన్నాదురై, పార్టీ స్థానిక నాయకులను వెంటబెట్టుకుని రహదారికి ఇరువైపులా ఉన్న కూరగాయల వ్యాపారులకు నమస్కరిస్తూ కరపత్రాలను పంచిపెడుతూ ప్రచారం చేశారు. కల్లైకడై జంక్షన్ సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్‌లో వెళ్లి అక్కడి వ్యాపారులను పలకరిస్తూ డీఎంకే అభ్యర్థులకు ఓటేసి గెలిపించడంటూ అభ్యర్థించారు. ఆ తర్వాత జ్యోతి పూల మార్కెట్‌లో వెళ్లి అక్కడి వ్యాపారులకు కరపత్రాలు అందజేశారు. ఆ సందర్భంగా పూలవ్యాపారుల సంఘం ప్రతినిధులు స్టాలిన్‌ను పూలమాలతో, శాలువతో సత్కరించారు. అరుణాచలేశ్వరాలయం రాజగోపురం ఎదుట కర్పూరం విక్రయించే మహిళలను కలుసుకుని ఉదయించే సూర్యుడి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఆ తర్వాత రథం వీధిలో స్థానికులను ఓట్లు అభ్యర్థించారు. చివరగా తన ప్రచారాన్ని ముగించుకుని ఓ టీషాపుకు వెళ్ళి మంత్రి ఈవీ వేలుతో కలిసి అల్లం టీ తాగి అక్కడి నుంచి గెస్ట్ హౌస్‌కు బయలుదేరారు.



తిరువణ్ణామలై ఆలయం ఎదుట స్టాలిన్‌కు పూలమాల వేయడానికి ప్రయత్నిస్తున్న మహిళ

## మనోజ్ పి.సెల్వంకు అడుగడుగునా బ్రహ్మరథం

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి మనోజ్ పి.సెల్వంకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారు. మిగతా పార్టీల నేతలు ప్రధాన వీధుల్లో ప్రచారం చేపడుతుండగా, మనోజ్ మాత్రం ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. దీంతో తమ ఇంటి ముందుకొచ్చిన మనోజ్‌ను తమ అతిథిగా భావిస్తుండడం విశేషం. బుధవారం ఆయన అంబేడ్కర్ కాలనీ, రాయల్ హౌసింగ్ బోర్డు, శక్తినగర్, మోహన్ విల్లా మార్గ్, షెనాయ్ నగర్, పెరియకూడల్, భారతీపురం, ఎం.ఎం.కాలనీ, పీపీ తోట్టం, ఎన్‌ఎస్‌కే నగర్ తదితర ప్రాంతల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వినోజ్ మాట్లాడుతూ... గతానికి భిన్నంగా ఈ సారి ఓటర్లు తమను విశేషంగా ఆదరిస్తున్నారని తెలిపారు. ఎవరికి వారు స్వచ్ఛందంగా ఎదురువచ్చి మరీ స్వాగతం పలుకుతుండడం ప్రజల్లో మార్పుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. బీజేపీకి రాష్ట్రంలో ఆదరణ పెరుగుతుందనడానికి ఇదొక ఉదాహరణ అని, మున్ముందు తమకు మంచి ఫలితాలు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన పట్ల ప్రజలు సానుకూలంగా వున్నారని, అన్ని వర్గాలు సంతోషంగా వున్నాయని తెలిపారు.



మనోజ్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

## జోలెపట్టి అడుగుతున్నా...

● ఓటేయ్యాలంటూ రాధిక వేడుకోలు

● పాపం ఎన్ని కష్టాలో!!

చెన్నై, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సినీ నటి రాధిక ఆమె నటించిన 'చిత్తి' (పిన్నమ్మ) టీవీ సీరియల్ డైలాగులు, 'కిళక్కు చీమయిలే' సినిమా డైలుగులు చెబుతూ ఓట్ల వేట సాగిస్తున్నారు. మీ సోదరిగా, మీ అక్కగా, మీ పిన్నమ్మగా భావించి గెలిపించండి అంటూ వేడుకుంటున్నారు. కప్పలూరు వద్ద ఓపెన్‌టాప్ వ్యాన్‌పై భర్త శరత్‌కుమార్‌ను వెంటబెట్టుకుని రాధిక ప్రచారం చేశారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో నియోజకవర్గ సమస్యలు ప్రస్తావించి వాటిని పరిష్కరిస్తానని చెప్పారు. ఆ తర్వాత ప్రచారం ముగించుకుని వెళ్తుండగా స్థానికులు అడ్డుకుని 'కిళక్కు చీమయిలే' చిత్రంలో విరుమాయి (రాధిక నటించిన పాత్ర పేరు)గా డైలాగులు చెప్పమంటూ అడిగారు. వారి కోరిక మేరకు రాధిక తన కొంగును జోలెగా మార్చుకుని 'మీ సోదరిగా జోలెపట్టి అడుగుతున్నా ఓటేసి గెలిపించండి!' అంటూ గద్గద స్వరంతో పలికారు. వెంటనే వ్యాన్ చుట్టూ నిలిచిన ప్రజలే కాకుండా ఆమె పక్కనే నిలబడిన భర్త శరత్‌కుమార్ కూడా చప్పట్లు కొట్టారు.



వ్యాన్ నుంచి జోలెపట్టుకుని ఓట్లను అర్థిస్తున్న రాధిక



సేలం బజారు వీధిలో ఈపీఎస్ చెంపలను ఆప్యాయంగా నిమురుతున్న మహిళ

## సేలంలో ఈపీఎస్

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి బుధవారం సేలం నగరంలోని బజారు వీధిలో ప్రచారం చేశారు. రహదారి పక్కనే ఉన్న పూల వ్యాపారులు, పండ్ల దుకాణాల యజమానులు, వ్యాపారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆ సందర్భంగా ఈపీఎస్ అందరికీ కరపత్రాలు పంపిణీ చేసి రెండాకుల గుర్తుపై ఓటేసి అన్నాడీఎంకే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సేలం అన్నాడీఎంకే అభ్యర్థి విఘ్నేష్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. పూలమ్ముకునే మహిళలు ఆయనకు గజమాల వేసి సత్కరించారు. ఆ తర్వాత ఆయనకు పండ్లు, పూలు, కాయగూరలను కానుకగా అందించారు. కొంత మంది మహిళలు ఈపీఎస్‌కు దగ్గరగా వెళ్ళి ఆయన చెంపలు నిమిరారు. ఇలా వ్యాపారులంతా పెద్ద సంఖ్యలో గుమికూడి తనకు స్వాగతం పలుకడం పట్ల ఈపీఎస్ హర్షం వ్యక్తం చేశారు.

## వల్లికుమ్మి నృత్యంలో అన్నామలై

● ఎయ్...చిందెయ్

పెరంబూర్, ఏప్రిల్ 3: కోయంబత్తూర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ తరఫున ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకేకు దీటుగా పలు చిన్నాచితకా పార్టీలతో బీజేపీ కూటమి ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో, పార్టీ అధ్యక్షుడిగా అన్నామలై పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. అదే సమయంలో తన నియోజకవర్గంలో కూడా ప్రచారం చేపట్టారు. ఎప్పుడు వార్తల్లో ఉండాలనుకొనే అన్నామలై ప్రచారంలో కూడా వినూత్న శైలి పాటిస్తున్నారు. మంగళవారం రాత్రి వెల్లకినరు ప్రాంతంలో వాహనంలో అన్నామలై ప్రచారం చేస్తుండగా, కార్యకర్తలు వాహనం ముందు వల్లి కుమ్మి నృత్యం చేశారు. అన్నామలై వెంటనే వాహనం దిగి వారితో కాలు కదిపారు.



కార్యకర్తలతో కలసి నృత్యం చేస్తున్న అన్నామలై



## అధిక ఓట్లు తెచ్చే నేతలకు

● ఇన్నోవా కారు, బంగారు చైన్



పెరంబూర్, ఏప్రిల్ 3: తిరుచ్చి లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే అభ్యర్థిగా పి.కరుపయ్య పోటీ చేస్తున్నారు. ఆయన పరిచయ సభ మంగళవారం రాత్రి జరిగింది. ఈ సభలో మాజీ మంత్రి సి.విజయభాస్కర్ మాట్లాడుతూ... ఈ నియోజకవర్గంలో అన్నాడీఎంకే విజయానికి నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని కోరారు. అదే సమయంలో తమ ప్రాంతాల్లో పార్టీ అధిక ఓట్లు వచ్చేలా కృషి చేసిన నగర కార్యదర్శులకు ఇన్నోవా కారు, తాలూకా కార్యదర్శులకు బంగారు చైన్లు ఇస్తామని ప్రకటించారు. కాగా, ఈ నియోజకవర్గంలో డీఎంకే కూటమి తరఫున ఎండీఎంకే అభ్యర్థిగా దురై వైగో, ఏఎంఎంకే అభ్యర్థిగా సెంథిల్‌నాథన్ సహా 38 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

● ప్రచారంలో తప్పదు కదా

## ఎన్నిసార్లు పేరు పెట్టమంటావమ్మా

● మహిళపై అన్నాడీఎంకే అభ్యర్థి అసహనం

ప్యారీస్, ఏప్రిల్ 3: తేని లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే తరఫున పోటీ చేస్తున్న నారాయణస్వామి... దేవనాంపట్టి తదితర ప్రాంతాల్లో కార్యకర్తలతో కలసి ప్రచారం చేపట్టారు. ఆయన్ని ఆహ్వానించేందుకు వచ్చిన గుంపులో ఓ మహిళ తన 11 నెలల బిడ్డకు పేరు పెట్టాల్సిందిగా నారాయణస్వామిని కోరారు. ఆడా, మగా అని ఆరా తీసిన ఆయన.. ఆ తరువాత 'జయం రామచంద్రన్' అని నామకరణం చేశారు. దీంతో ఆ బిడ్డ తల్లి ఒక్కసారిగా గయ్యిన లేచింది. తన బిడ్డకు గతంలో తమ కులదైవం పేరు పెట్టామని, ఆ స్వామి పేరు మారిస్తే ఒప్పుకోనని కేకలేసింది.దాంతో అసలు విషయం గ్రహించిన నారాయణస్వామి.. ముందుగా ఒకసారి పేరు పెట్టిన బిడ్డను మళ్లీ తన వద్దకు ఎందుకు తెచ్చావంటూ ఆ మహిళపై రుసరుసలాడారు.



● టంగ్ స్లిప్పయింది

## ఓపీఎస్ నోట 'రెండాకులు' మాట

పెరంబూర్, ఏప్రిల్ 3: మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున స్వతంత్ర అభ్యర్థిగా 'పనస పండు' గుర్తుపై పోటీ చేస్తున్నారు. అదే నియోజకవర్గంలో పన్నీర్‌సెల్వం పేరుతో మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులుగా ఉండడం ఓపీఎస్‌కు తలనొప్పిగా మారింది. అదే సమయంలో ప్రచారంలో కూడా ఓపీఎస్ గుర్తు మార్చి చెబుతుండడంతో ఆయన మద్దతుదారులు తలలు పట్టుకుంటున్నారు. పరమకుడి సమీపం పోకలూరు, తుర్తియనేందల్, మంజూర్ తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టిన పన్నీర్‌సెల్వం 'రెండాకులు గుర్తుకు ఓటేయాలి' అంటూ ప్రచారం చేశారు. అంతలోనే తమాయించుకున్న ఆయన మళ్లీ పనస పండు గుర్తుకు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ప్రచారం కొనసాగించారు.



ప్రచారంలో తన గుర్తును చూపిస్తున్న ఓపీఎస్

● ఇంతకీ ఎందుకలా

## రాత్రి చిదంబరంతో వాగ్వాదం

● ఉదయం అన్నాడీఎంకే అభ్యర్థికి హారతులు



అన్నాడీఎంకే అభ్యర్థికి హారతి ఇస్తున్న మహిళ

పెరంబూర్, ఏప్రిల్ 3: కారైక్కుడి సమీపంలో రాత్రి వేళ ప్రచారానికి వచ్చిన కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరంతో వాగ్వాదానికి దిగిన ఓ మహిళ, మరుసటిరోజు ఉదయం అన్నాడీఎంకే అభ్యర్థికి హారతులిచ్చి ఆహ్వానించడంతో ఆ ప్రాంత ప్రజలు ఖంగుతిన్నారు. శివగంగ జిల్లా కారైక్కుడి సమీపం మిత్రవయల్ ప్రాంతంలో సోమవారం రాత్రి కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ చిదంబరంకు మద్దతుగా ఆయన తండ్రి పి.చిదంబరం ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతున్న సమయంలో, ఈ ప్రాంతంలోని టాస్మాక్ మద్యం దుకాణం మూసివేయాలని కేకలు వేశారు. వారిలో ఒక మహిళ మాత్రం కేకలు వేస్తూనే ఉంది. తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఉండడంతో తన కుమారుడికి అమ్మాయిని ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారంటూ కేకలు వేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం అన్నాడీఎంకే అభ్యర్థి జేవియర్‌దాస్ ఆ గ్రామంలో ప్రచారానికి రాగా, సదరు మహిళ హారతులిస్తూ ఆహ్వానం పలికారు. సదరు మహిళ మద్యం దుకాణం పేరుతో కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా మాట్లాడారని ఆ పార్టీ కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు.

## 14 యేళ్ల తర్వాత 'పయ్యా' రీ రిలీజ్

చిత్రజ్యోతి

ఇటీవల గతంలో విడుదలై ఘన విజయం సాధించిన అనేక చిత్రాలను డిజిటల్ టెక్నాలజీతో రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ కోవలోనే హీరో కార్తీ, తమన్నా జంటగా నటించిన 'పయ్యా' చిత్రం రీ రిలీజ్‌కు సిద్ధమైంది. ఎన్.లింగుస్వామి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చారు. ఈ చిత్రం రీ రిలీజ్ గురించి హీరో కార్తీ మాట్లాడుతూ... 'పరుత్తివీరన్' చిత్రంలో ఒకే ఒక్క పంచె, చొక్కాలో కనిపించిన నేను... 'పయ్యా'లో రంగురంగుల దుస్తుల్లో దర్శకుడు లింగుస్వామి చూపించారు. పైగా తొలిసారి విడుదలైనపుడు లభించిన ఆదరణే రీ రిలీజ్ రోజు కూడా లభిస్తుందని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. దర్శకుడు ఎన్.లింగుస్వామి మాట్లాడుతూ.. 'పరుత్తివీరన్'లో మొరటోడుగా కనిపించిన కార్తీ.. ఈ సినిమాలో పూర్తిగా సిటీ చాక్లెట్ బాయ్‌గా కనిపించి అద్భుతమైన నటన కనబరిచారు' అని తెలిపారు. కాగా, గత 2010లో విడుదలైన ఈ చిత్రం సూపర్‌హిట్ సాధించింది. ఈ నెల 11న రీ రిలీజ్ చేసేందుకు నిర్మాత ఎన్.సుభాష్ చంద్రబోస్ సన్నాహాలు చేస్తున్నారు.



'పయ్యా'లో కార్తీ, తమన్నా

## రెమ్యునరేషన్ పెంచేసిన సీనియర్ హీరోయిన్లు

కోలీవుడ్‌కు చెందిన సీనియర్ హీరోయిన్లు ఒకరి తర్వాత ఒకరు రెమ్యునరేషన్‌ను పెంచేస్తున్నారు. త్రిష, నయనతార ఈ జాబితాలో ముందున్నారు. 'పొన్నియిన్ సెల్వన్', 'లియో' చిత్రాల్లో నటించిన త్రిష.. తన పారితోషికాన్ని ఒక్కసారిగా పెంచేసినట్టు సమాచారం. ఈ రెండు చిత్రాలు విడుదలకు ముందు రూ.7 కోట్లు తీసుకుంటూ వచ్చిన ఆమె... ఆ తర్వాత రూ.12 కోట్లకు పెంచేశారని కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం నయనతార ఆ జాబితాలో చేరిపోయారు. ఈమె కొత్తగా కమిట్ అయ్యే చిత్రాలకు ఏకంగా రూ.12 కోట్ల రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నట్టు వినికిడి. గత యేడాది హిందీలో షారూక్ ఖాన్ - డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వచ్చిన 'జవాన్'లో నయనతార ముఖ్య పాత్రను పోషించారు. ఈ సినిమా తర్వాత ఆమె 'ఇరైవన్', 'అన్నపూరిణి' వంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో నటించారు. కానీ, ఇవి తీవ్ర నిరాశపరిచాయి. అయినప్పటికీ ఆమె తన పారితోషికాన్ని పెంచడం ఇపుడు కోలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.



నయనతార